క్లుప్తంగా

నేటి నుంచి వీరభద్రేశ్వర స్వామి జాతర

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మెరియంపూర్ సమీపంలోని వీరభద్రేశ్వ స్వామి దేవాలయంలో ఈనెల 10 నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. మూడు రోజుల పాటు జాతర ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్వహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున ఉదయం స్వామివారికి పాద పూజ, పల్లకిసేవా, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించనున్నారు. 11న స్వామివారికి రుద్రాభిషేకం, పల్లకి ఉత్సవం, 12న రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా ఎల్లమ్మదేవి నాటక ప్రదర్శన


నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో రేణుకఎల్లమ్మదేవి నాటక ప్రదర్శన వైభవంగా కొనసాగుతుంది. ప్రదర్శనలో భాగంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు నాటక ప్రదర్శన నిర్వహించారు. మూడవ రోజున ఎల్లమ్మదేవికి పుత్రులజననం, దేవిని కారాగృహం నందు బంధించుట ప్రదర్శనను నిర్వహించారు. నాటక ప్రదర్శను వీక్షించేందుకు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు సమీపంలోని రాయికోడ్, ఝరాసంగం, జహీరాబాద్, మనూర్, నారాయణఖేడ్ తదితర ప్రాంతాలతో పాటు కర్నాటక రాష్ట్రం నుంచి అధికసంఖ్యలో తరలివచ్చారు. నాటక ప్రదర్శన ఈనెల 10న ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎంపీటీసీకి పరామర్శ


నారాయణఖేడ్: పట్టణానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఈశ్వరీబాయి గుండె శస్త్రచికిత్స చేయించుకుని తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకుని మాజీ ఎంపీ, పీసీసీ ఉపాధ్యక్షులు సురేశ్ షెట్కార్ ఆదివారం ఆమెను పరామర్శించారు. ఈశ్వరీబాయి కుమారులైన సుదర్శన్‌గౌడ్, గోపీగౌడ్‌లను అడిగి ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు నెహ్రూనాయక్, సాయిలు, కల్యాణి అశోక్, మోహన్‌గౌడ్ ఉన్నారు.

కేంద్ర మాజీ మంత్రి నరేంద్రకు నివాళి


నరేంద్ర చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

జోగిపేట(అందోల్): కేంద్ర మాజీ మంత్రి ఆలె నరేంద్ర 9వ వర్ధంతిని ఆదివారం జోగిపేటలో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ మాజీ కన్వీనర్ ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ జహీరాబాద్ ఎంపీగా, కేంద్ర మంత్రిగా పనిచేసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని గుర్తు చేశారు. పార్టీలు మారినా ఆయన అభిమానాన్ని తాము మరచిపోలేమన్నారు. కార్యక్రమంలో ఆందోల్ అసెంబ్లీ కన్వీనర్ మాజీ ప్రభాత్‌కుమార్, జిల్లా కిసాన్ మోర్చా రుద్రారం మాణయ్య, నాయకులు మహేందర్, ఆంజనేయులు, వెంకటరమణ పాల్గొన్నారు.

బోరుమోటారు ప్రారంభం


బోరుమోటార్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మీనాక్షిసాయికుమార్

మునిపల్లి(అందోల్): భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జెడ్పీటీసీ నిధుల ద్వారా బోరువేసినట్లు జెడ్పీటీసీ మీనాక్షిసాయి కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని ఖమ్మంపల్లి శివాలయ ప్రాంగణంలో బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, జెడ్పీ చైర్మన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి సహకారంతో బోరు వేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జాస్మిన్, ఎంపీటీసీ శివలీల, ఉపసర్పంచ్ శాంతమ్మ పాల్గొన్నారు.

బసవేశ్వరుడి విగ్రహ ఆవిష్కరణకు తరలిరావాలి

రాయికోడ్(అందోల్): రామచంద్రపూర్ సమీపంలోని బీరంగూడ చౌరసా వద్ద ఈ నెల 16వ తేదీన నిర్వహించే విశ్వగురు బసవేశ్వరుని కాంస్య విగ్రహ ఆవిష్కరణకు జిల్లాలోని లింగాయతీలు తరలివచ్చి విజయవంతం చేయాలని వీరశైవ లింగాయత్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనిమిషెట్టి జయప్రకాశ్ కోరారు. మండల కేంద్రం రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయంలో ఆదివారం బసవ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్‌ను స్థానిక సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

ప్రమాదకరంగా ముళ్లచెట్లు

- కనిపించని సూచిక బోర్డులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


నర్సాపూర్-గుంతమర్పల్లి రహదారిపై ముళ్లపొదలు

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో గ్రామీణ రహదారులు పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయాయి. ఫలితంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండల పరిధిలోని నర్సాపూర్, గుంతమర్పల్లి, జీర్లపల్లి, బోరెగాం, సిద్దాపూర్, తదితర గ్రామాలకు వెళ్లే రహదారికి ఇరువైపులా మూలమలుపుల వద్ద ముళ్లపొదలు దట్టంగా పెరగటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మండల కేంద్రానికి నిత్యం వివిధ గ్రామాల ప్రజలు వివిధ పనులపై, విద్యార్థులు చదువుకునేందుకు ద్విచక్రవాహనాలు, ఆటోలలో వెళ్తుంటారు. ఈ క్రమంలో ఎదురుగా వాహనాలు వచ్చిన సమయంలో మోహానికి తగిలి గాయాలపాలవుతున్నారు. ముళ్లచెట్లు తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని వాహనదారులు వాపోతున్నారు.

కనిపించని సూచిక బోర్డులు...

ఆయా గ్రామాలకు వెళ్లే రహదారుల మూలమలుపుల వద్ద ఉన్న సూచిక బోర్డులు వంగిపోవటం, నేలకు ఒరిగిపోయి దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రమైన ఝరాసంగంలోని సంగమేశ్వర ఆలయానికి, బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమానికి, కర్ణాటక, మహారాష్ట్రలలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివస్తుంటారు. ఈ క్రమంలో సూచికబోర్డులు కనిపించకపోవడంతో అయోమయానికి గురై ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముళ్లపొదలు తొలగించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ముళ్లపొదలు తొలగించాలి



రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు వాహనదారులకు ఇబ్బందిగా మారాయి. మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే సమయంలో రహదారుల పక్కన ఉన్న ముళ్లచెట్లు తగిలి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిద వెంటనే ముళ్లపొదలను తొలగించాలి.

– హరీశ్, బర్దీపూర్, మండలం, ఝరాసంగం

సూచిక బోర్డులు సరి చేయాలి



మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారుల పక్కన ఉన్న సూచిక బోర్డులను సరిచేయాలి. చాలా చోట్ల ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు వంగిపోవటంతో వాహనదారులకు కనిపించటం లేదు. దీంతో వాహనదారులుఅయోమయానికిగురైప్రమాదాలకు గురవుతున్నారు.

– శ్రీనివాస్, సిద్దాపూర్, మండలం, ఝరాసంగం

కార్మిక పక్షపాతి సీఎం కేసీఆర్

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


పటాన్‌చెరు:మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కార్మికుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మే1న నిర్వహించనున్న భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ అనుబంధ విభాగం భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడే సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కృషితో నూతన పారిశ్రామిక విధానం మూలంగా ప్రపంచ స్థాయి పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని వివిధ పరిశ్రమలలో కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలను చేసిన ఘనత బీఆర్‌టీయూకే దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, జిల్లా అధ్యక్షులు శివశంకర్, ఈఎస్‌ఐ బోర్డుమెంబర్ రమణారెడ్డి, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): వేసవికాలంలో నీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దాదిగూడెం గ్రామంలో ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.3లక్షలతో వేయించిన బోరును ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి భారతినగర్ డివిజన్ పరిధిలోని మాక్స్‌సొసైటీ కాలనీలో రమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు త్వరలో కుట్టుమిషన్‌లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లన్న దేవాలయ విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, స్థానిక నాయకులు సురేందర్‌గౌడ్, గణేష్ పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర జాతరలో భాగంగా మంగళవారం ఆలయంలోని కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వహకులైన స్థానిక యువజన సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొనే వారు 9989547676, 8008176349 సెల్‌నంబర్లను సంప్రందించాలని సూచించారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు


జహీరాబాద్ టౌన్: ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు దంపతులు



జిన్నారం: ఈస్టర్ వేడుకలో మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి


పటాన్‌చెరు టౌన్: ఈస్టర్ వేడుకల్లో నీలం మధు ముదిరాజ్


పటాన్‌చెరు: ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న క్రైస్తవులు

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలో ఈస్టర్ పండగను క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే మాణిక్ రావు దంపతులు మెథడిస్టు చర్చిలో నిర్వహించిన ప్రార్థనలో పాల్గొన్నారు.

పటాన్‌చెరు: ప్రపంచ మానవాళికి ఏసుక్రీస్తు బోధనలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ మరనాత సువార్త మందిరంలో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, మేరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రంలో... ఝరాసంగంతో పాటు వివిధ గ్రామాల్లో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు చర్చీలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. న్యాల్‌కల్, గంగ్వార్, మెటల్‌కుంట, టేకూర్, ముంగి, హద్నూర్ తదితర గ్రామాల్లోని చర్చిల్లో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుప్రభు పాటలు పాడతూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పాస్టర్లు భక్తులకు దైవసందేశం ఇచ్చారు.

పటాన్‌చెరు టౌన్: ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ తెలిపారు. ఆదివారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో బ్యూలా చర్చి, వడ్డెర కాలనీలోని ఎంపీ చర్చిలో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో నీలం మధు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రకాష్‌రావు, పాస్టర్ సీమన్, వార్డుసభ్యులు రాజ్‌కుమార్, మాజీ నీటి సంఘం అధ్యక్షులు వెంకటేశ్, హేమల, తాతరావు, బరంబస్, గోపాల్, శ్రీను, విష్ణు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

జిన్నారం (పటాన్‌చెరు): మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో క్రిస్టియన్ సోదరులు ప్రార్థనలు నిర్వహించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా చర్చిల్లో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కోహీర్(జహీరాబాద్): కోహీర్ మండలంలో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 40 రోజు ఉపవాస దీక్షలు పాటించిన వారు దీక్ష విరమించారు.

హరి సంకీర్తనలతో ప్రశాంతత


నీలం ముధుకు కృష్ణుడి విగ్రహాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: హరే రామ, హరే కృష్ణ సంకీర్తనలతో ప్రశాంతత లభిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్ హనుమాన్ దేవాలయంలో అఖండ హరి కీర్తన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్‌ను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కద్నవన సింగ్, చౌదరి, కమల్‌సింగ్, కిషన్, మెట్టు కృష్ణ, మెట్టు రాజు యాదవ్, సందీప్, రమేష్, మనోజ్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో కాంగ్రెస్ నాయకులు...

పట్టణంలోని శాంతినగర్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన 24 గంటల అఖండ హరిసంకీర్తన కార్యక్రమంలో పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు యువరాజ్, కిషన్, రాజేందర్‌సింగ్, చంద్రశేఖర్, మహాదేవ్, పాండే పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన


భజన చేస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హమాలీకాలనీ, మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో ఆదివారం నగర సంకీర్తన కార్యక్రమాన్నిభక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా హమాలీకాలనీలోని పెద్దమ్మగుడి వద్దకు చేరుకున్న భక్తులు భజనలు, కీర్తనలతో భగవంతుడి నామస్మరణ చేశారు. అదేవిధంగా హుగ్గెల్లి గ్రామంలో పాదయాత్ర నిర్వహించి ఆటపాటలతో సందడి చేశారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు పెంచాలి

సంగారెడ్డి టౌన్ : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు పెంచాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మురళీధర్ అన్నారు. ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులందరికీ పింఛన్ పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మురళి, మొగులయ్య, లక్ష్మణ్, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బీరప్పస్వామికి పూజలు**

రాయికోడ్(అందోల్): మండలంలోని చిమ్నాపూర్ చౌరస్తాలో గొల్లకుర్మల ఆరాధ్య దైవమైన బీరప్ప స్వామికి ఆదివారం భక్తులు బోనాలను సమర్పించి పూజలు నిర్వహించారు. సర్పంచ్ పాగాకు రాధిక సతీష్‌కుమార్, ఎంపీటీసీ శివకుమార్ పాటిల్ గొల్లకుర్మ పెద్దలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు తిరుమల శ్రీకాంత్, స్థానికులు రాంరెడ్డి, మల్లన్న, శంకర్, నగేష్, ధన్‌రాజ్, గోపాల్, లక్ష్మయ్య, నర్సింలు పాల్గొన్నారు.

◆ **వెల్టూర్‌లో ఘనంగా బీరప్ప జాతర**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెల్టూర్ గ్రామంలో బీరప్పస్వామి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులు ఉదయం స్వామిని దర్శించుకొని బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో కురుమ సంఘంపెద్దలు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

◆ **ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ అధ్యక్షుడిగా శంకర్**

నారాయణఖేడ్: ముదిరాజ్ మహాసభ నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన అవుటి శంకర్ ముదిరాజ్‌ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు టప్ప కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఇన్‌చార్జి రమేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ముదిరాజ్ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

◆ **జోగిపేట గుమస్తా సంఘం అధ్యక్షుడు మృతి**

జోగిపేట(అందోల్): జోగిపేట గుమస్తా సంఘం అధ్యక్షుడు రంగంపేట నారాయణ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. 30 ఏళ్లుగా గుమస్తాల సంక్షేమం కోసం కృషిన ఆయన మృతి పట్ల పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శివశేఖర్, గుమస్తా సంఘం గౌరవ అధ్యక్షుడు డాకూరి శంకరయ్య సంతాపాన్ని తెలియజేశారు. అంత్యక్రియలకుగాను సంఘం తరఫున రూ.5వేల నగదును శివశేఖర్ కుటుంబసభ్యులకు అందజేశారు. ఆదివారం జోగిపేటలో అంత్యక్రియలను నిర్వహించారు. నారాయణ మృతి పట్ల పలువురు వివిధ పార్టీల నాయకులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

◆ **సీనియర్ జర్నలిస్టు కిష్టయ్య మృతి**

జోగిపేట(అందోల్): అందోలు తాలుకా జర్నలిస్టుల సంఘం మాజీ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు గాజుల కిష్టయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. నియోజకవర్గంలోని జోగిపేట కేంద్రంగా ఆయన వివిధ దినపత్రికలకు జర్నలిస్టుగా సేవలందించాడు. గాజుల కిష్టయ్య మృతి పట్ల అందోలు ఎమ్మెల్యే చంటిక్రాంతికిరణ్, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, రాష్ట్ర తెలంగాణ జాగృతి నాయకులు బిక్షపతి, అందోలు నియోజకవర్గ జర్నలిస్టు నాయకులు సంతాపాన్ని తెలియజేశారు.ఆదివారం జోగిపేటలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, జర్నలిస్టులు, బంధువులు హాజరై నివాళులర్పించారుర.

◆ **ఎన్ఎస్ఎస్ సేవలు అభినందనీయం**

ఝరాసంగం(జహీరాబాద్): ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అందించే సేవలు అభినందనీయమని సర్పంచ్ అమర్జిత్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మండల పరిధిలోని కృష్ణాపూర్ గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరం ఆదివారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా ప్రోగ్రాం అధికారులతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాములు, పాఠశాల కమిటీ చైర్మన్ శాంతప్ప, హెచ్ఎం శివరత్నం పాల్గొన్నారు.

◆ **వేగవంతంగా గొర్రెల పంపిణీ ప్రక్రియ**

నారాయణఖేడ్: నియోజకవర్గంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండో విడత గొర్రెల పంపిణీని అధికారులు వేగవంతం చేశారని నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షులు ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గొర్రెల యూనిట్ విలువ రూ.1,75,000 కాగా 75శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. సబ్సిడీ పోను లబ్దిదారులు తమ వాటాగా రూ.43,750 ముందుగా తమ తమ బ్యాంకు ఖాతాల్లో వేసుకుని అధికారులు కేటాయించిన లబ్దిదారుల వర్చువల్ ఖాతాకు బదిలీ చేయాల్సి ఉంటుందన్నారు. లబ్దిదారులు తమతమ వాటా డబ్బులను సకాలంలో కా తాల్లో వేసుకోవాలన్నారు. సందేహాలు, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత


నారాయణఖేడ్: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 12మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదివారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఖేడ్ మండలంలోని హన్మంత్‌రావుపేట్‌కు చెందిన శివలీలకు రూ.45వేలు, తుర్కాపల్లి తండాకు చెందిన జెమిని బాయికి రూ.42వేలు, రజనీబాయికి రూ.19వేలు, బుజ్జిబాయికి రూ.30వేలు, పిప్రికి చెందిన శోభాబాయికి రూ.9,500, చాప్టా(కె)కు చెందిన విఠల్‌రెడ్డికి రూ.51వేలు, మాద్వార్‌కు చెందిన శివరాజ్‌కు రూ.16వేలు, మాణిక్‌నాయక్ తండాకు చెందిన శానుబాయికి రూ.20వేలు, శాంకీబాయికి రూ.20వేలు, సిర్గాపూర్ మండలం కడ్పల్‌కు చెందిన రాములుకు రూ.46వేలు, కంగ్టి మండలం ముకుంద్ తండాకు చెందిన గంగుబాయికి రూ.14,500, పెద్ద శంకరంపేట మండలం టెంకటికి చెందిన ప్రభాకర్‌కు రూ.13వేలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో ఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, ఎంపీటీసీ నారాయణనాయక్ పాల్గొన్నారు. అనంతరం నిజాంపేట్ మండలం నాన్యానాయక్ తండాలో రూ.64లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులతో పాటు హైమాస్ట్‌లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ రోషన్ రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ రాంసింగ్, సర్పంచ్ నవాబ్ పటేల్ పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు


సదాశివపేట(సంగారెడ్డి): ఇఫ్తార్ విందులో ముస్లింలు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ముర్షత్ దర్గా అవరణలో పీఎంఆర్ డెవలపర్, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బీఆర్ఎస్ 12వ వార్డుకౌన్సిలర్ పులిమామిడి రాజు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతాగోపాల్, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పులిమామిడిరాజు, కౌన్సిలర్ గుండు రవి, కోఆప్షన్ మెంబర్ ఖలీంపటేల్, మాజీ కౌన్సిలర్ సతాని శ్రీశైలం పాల్గొన్నారు

- సదాశివపేట పట్టణ మైనార్టీ సోదరుడు షబ్బీర్ రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ కోఆర్డినేటర్ సాయినాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయినాథ్‌రెడ్డి ముస్లింసోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌టీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి రంగల్ల రమేష్, నాయకులు ఎల్లయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం....

రామచంద్రాపురం(పటాన్‌చెరు) రామచంద్రాపురం పట్టణంలోని ఈఎస్ఐ అసుపత్రి సమీపంలో ఆదివారం ఎన్ఎంఆర్ యువసేన నాయకులు షకీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్‌విందులో రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. అనంతరం చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి

కొండాపూర్‌సంగారెడ్డి): టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేసి ప్రశ్నాపత్రాల లీకేజీని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వైఎస్సార్ టీపీ సంగారెడ్డి అసెంబ్లీ కోఆర్డినేటర్ సాయినాథ్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సంగారెడ్డిలోని పాత బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయినాథ్‌రెడ్డి మాట్లాడుతూ సీఆర్ బిస్వాల్ కమిటీ ప్రకారం 1.91లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు విడుదల చేసి ప్రశ్నాపత్రాలు బయటకు రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీపీ నాయకులు రమేష్, శివాజీ ప్రవీణ్, సాయికుమార్, ప్రకాష్, ఎల్లయ్య, మైపాల్ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపుర దేవాలయంలో ఆదివారం వేంకటేశ్వర స్వామి కళ్యాణం మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పూలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు: ప్రతిరోజు దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆడపిల్లకు అండగా..


అకౌంట్ ఓపెన్ పత్రాలను అందజేస్తున్న సర్పంచ్

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని దోమడుగు గ్రామ సర్పంచ్ రాజశేఖర్ ఆదివారం తన పుట్టిన రోజు సందర్భంగా ఆడపిల్లల కోసం ప్రత్యేక చర్యలు ప్రారంభించారు. 'ఆడపిల్ల పుడితే పండగే' అనే నినాదాన్ని తీసుకువచ్చారు. రూ.5వేలతో సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా అకౌంట్‌ను తెరిపించేలా చర్యలు ప్రారంభించారు. పుట్టిన రోజు సందర్భంగా ఇద్దరు ఆడపిల్లల తల్లులకు రూ.5వేలతో అకౌంట్‌ను ఓపెన్ చేయించి సంబంధిత పత్రాలను తల్లులకు అందజేశారు. గ్రామంలో ఎవరికి ఆడపిల్ల పుట్టినా వారి పేరిట రూ.5వేలతో అకౌంట్‌ను ఓపెన్‌చేయించి ఇస్తామన్నారు. ఈ సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని రాజశేఖర్ సూచించారు.